క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



సిబ్బందిని పరిచయం చేసుకుంటున్న తహసీల్దార్ వరప్రసాద్

బాడంగి: మండల తహసీల్దార్‌గా కాగాం వర ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీక రించారు.ఈయన దత్తిరాజేరు మండల హెచ్‌డీటీగా పనిచేసి తహసీల్దార్(ఎఫ్ ఏసీ)గా ఇక్కడికి వచ్చారు. ఇదివరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన కె.సుధాక ర్‌కు ఎస్డీసీగా పదోన్నతి లభించడంతో రిలీవ్ అయ్యారు.తహసీల్దార్ వరప్రసాద్ కు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

కుట్టు శిక్షణలో అక్రమాలు చేస్తే చర్యలు



కుట్టుశిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం: మహిళల ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో బినామీల పేరుతో శిక్షణ పొందుతున్నట్టు అక్రమాలు చేస్తే చర్యలు తప్పవని కుట్టు శిక్షణ కేంద్రం నిర్వాహకులను ఎంపీడీఓ వి. శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని కొండంపేట రోడ్డులోని ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. శిక్షణకు హాజరైన మహిళల వివరాలను, శిక్షణ పరికరాలపై నిర్వాహకులను ఆరా తీశారు. శిక్షణకు పూర్తి స్థాయిలో హాజరైన వారికి మాత్రమే ధ్రువీకరణ పత్రాలు, రాయితీలు అందుతాయని వెల్లడించారు.

ముంపు ప్రాంతాల్లో పంటల పరిశీలన



పాతచెలికానివలసలో పంట పొలాలను పరిశీలిస్తున్న వీఏఏ

రేగిడి: మండలంలోని ఆకులలోవ కట్టగెడ్డ వరద నీటి వల్ల వెంకంపేట, పాతచెలికానివలస, కొత్తచెలికానివలస, ఆమదాలవలస తదితర గ్రామాల్లో పంట పొలాలు ముంపు బారినపడ్డాయి.పంట పొలాలను సచివాలయ వీఏఏలు బుధవారం పరిశీలించి, పంటలకు నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను రైతులకు వివరించారు. ప్రస్తుతం ఈ వరద వల్ల వరి పంటకు పెద్దగా నష్టం ఉండదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. పంట పొలాల్లో పూర్తిగా నీరు బయటకు పంపించిన తర్వాత ఎకరానికి 15 కిలోల యూరియా వేయాలని సూచించారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ



మంటలను ఆర్పేవిధానంపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖ ఎస్ఐ అశోక్

రాజాం సిటీ: అప్రమత్తంగా ఉండడం వల్ల అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని అగ్నిమాపకశాఖ ఎస్ఐ పి.అశోక్ అన్నారు. స్థానిక పాలకొండ రోడ్డులోని ఓ వస్త్ర దుకాణంలో సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదా లు సంభవించకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు సూచించారు. ప్రమాదాలు సంభవించే సమయంలో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా మంటలను అదుపు చేసే విధానాన్ని వివరించారు.

ఉద్యోగ విరమణ సన్మానం



హెచ్‌ఎం రామకృష్ణ దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

బాడంగి: పిన్నవలస ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన మింది రామకృష్ణను ఆ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు బుధవారం సన్మానించారు. అతిథులుగా హాజరైన ఎంఈఓలు లక్ష్మణదొర, రాజేశ్వరి హెచ్‌ఎం రామకృష్ణ, ఆయన భార్యకు జ్ఞాపికలు అందజేశారు. హెచ్‌ఎం పి.గౌరి, గ్రామపెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలసలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నామని పాలకొండకు చెందిన విజయమల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తలసేమియా బాధిత పిల్లలకోసం నిర్వహిస్తున్న ఈ శిబిరంలో యువకులు స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఏన్నాళ్లీ కాలయాపన కష్టాలు

- నత్తనడకన పారాది వంతెన నిర్మాణ పనులు
- రూ.11 కోట్లు మంజూరు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- పనులు ప్రారంభించాక ఎన్నికలు రావడంతో ముందుకు సాగని నిర్మాణం
- గత ప్రభుత్వంలో రూ. 92 లక్షలతో పాతన వంతెనకు మరమ్మతులు, తాత్కాలిక కాజ్‌వే నిర్మాణం
- రాజకీయలబ్ధి కోసమే గతప్రభుత్వంపై నాడు టీడీపీ దుష్ప్రచారం
- వైఎస్సార్‌సీపీ హయాంలో మంజూరైన నిధులున్నప్పటికీ పనులు చేపట్టకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- అధికారంలోకి వచ్చిన ఏడాదిలో పూర్తిచేస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే బేబీనాయన



పారాది కాజ్‌వే మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

నాడు రాజకీయ లబ్ధికోసం విమర్శలు, పుకార్లు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పారాది వద్ద తాత్కాలిక కాజ్‌వే నిర్మాణం, వంతెన మరమ్మతులు చేపట్ట డంతో తేలికపాటి వాహనాల రాకపోకలు సాగించడం వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా పోయా యి.తర్వాత మళ్లీ వర్షాకాలం రావడంతో తాత్కాలికంగా నిర్మించిన కాజ్‌వే మీదుగా నీరు ఉప్పొంగింది. ఎక్కడి నుంచో వరదలో కొట్టుకొచ్చిన భారీవృక్షాలు కాజ్‌వేపై నిలిచిపోయాయి. దీంతో అప్పటిలో పలువు రు రాజకీయ లబ్ధికోసం కాజ్‌వే కొట్టుకుపోయిందని ప్రచారం చేశారు. నిధులు పోయాయంటూ నాయకు లు, అధికారులపై లేనిపోని విమర్శలు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురద చల్లేందుకు కంకణం కట్టుకున్నారు. కానీ నిజం దేవుడెరుగన్నట్టు వరద ఉధృతి తగ్గగానే యథాతథంగా కాజ్‌వే ఉండడంతో విమర్శకులు కిమ్మనలేదు.

బొబ్బిలి: విశాఖపట్నం- రాయఘడ అంతర రాష్ట్ర రహదారిలో బొబ్బిలి మండలంలోని పారాదివద్ద వేగావతి నదిపై వంతెన నిర్మాణంలో కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తుండడంతో వాహన చోదకులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన నిధులున్నప్పటికీ పనులు చేపట్టకుండా కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ఇక్కడి పాతవంతెన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కుంగిపోవడంతో అప్పటి నుంచి దాని మీదుగా భారీ వాహనాలను అనుమతించలేదు. రాకపోకలు సాగించేందు కు ప్రత్యామ్నాయం లేకపోవడంతో తెర్లాం, బాడంగి మీదుగా వాహనాలను మళ్లించారు. మరోపక్క వంతెన స్థితిగతులను, ప్రజలు పడుతున్న ఇబ్బందులను, గత టీడీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరు చేయకుండానే విజయనగరం నుంచి చంద్రబాబునాయుడు నూతన వంతెన నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన చేసి వదిలేయడాన్ని అప్పటి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజల ఇబ్బందులను తెలుసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడ కొత్త వంతెన నిర్మాణానికి రూ.11 కోట్లు మంజూరు చేశారు. అంతేకాకుండా టెండర్లు పూర్తయ్యి, నిర్మాణ పనులు జరిగే వరకు ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా తాత్కాలికంగా కాజ్‌వే నిర్మాణానికి రూ.92లక్షలు మంజూరు చేశారు. ఓపక్క కుంగిన వంతెనకు గడ్డర్లు, సిమ్మెంట్ వర్క్‌ను, వంతెనపై బీటీ రోడ్డును కాంట్రాక్టర్‌తో చేయించారు. ఈవంతెనకు సమాంతరంగా కాజ్‌వేను త్వరితగతిన నిర్మించారు. దీంతో ప్రయాణికుల కష్టాలు తాత్కాలికంగా తీరాయి. తెర్లాం,బాడంగి మీదుగా భారీ వాహనాలను వెళ్లనీయకుండా తిరిగి పారాది మీదుగానే వెళ్లేలా నాటి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కొత్తగా వంతెన నిర్మించాల్సిన ప్రాంతం మీదుగా వెళుతున్న హెచ్‌టీ విద్యుత్ లైన్ తొలగింపు, ఇతర పనులు అప్పటిలోనే పూర్తయ్యాయి. ఇంతలో ఎన్నికలు రావడంతో వంతెన పనులు ముందుకు సాగలేదు.

నేడు కాలయాపన

టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే ఏడాదిలో వంతెన నిర్మాణం పూర్తి చేసేస్తామని కూటమి అభ్యర్థిగా ఎన్నికల్లో బేబీనాయన విస్తృతంగా ప్రచారం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఇంకా వంతెన నిర్మాణం పూర్తికాలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ఉన్నప్పటికీ పనుల్లో ప్రగతి కనిపించడం లేదు. ఏడాది దాటిపోయినా నేటికీ పిల్లర్లు కూడా పూర్తవ్వలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వర్షాలకు బుధవారం వేగావతి నది ఉధృతంగా ప్రవహించడంతో పారాది కాజ్‌వే మీదుగా గతంలో వలే వరద నీరు ప్రవహించింది. దీంతో ఉదయం వేళ వాహనాలను రామభద్రపురం వైపు మళ్లించారు. దీంతో రామభద్రపురం, బాడంగి రహదారులు మరింత దెబ్బతిన్నాయి. వంతెన నిర్మాణం సాగుతుండడంతో కాజ్‌వేను మరింత పటిష్టపరచడమో లేక రహదారులను పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించడమో చేపట్టాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. సమస్యను ఆర్‌అండ్‌బీ ఏఈ బి.కె.ఏ. రాజు వద్ద సాక్షి ప్రస్తావించగా.. వంతెన నిర్మాణం జరుగుతోందని, కారాడ-తెర్లాం రహదారి నిర్మాణానికి టెండర్లు ఖరారయ్యాయని చెప్పారు.చిలకపాలెం-రామభద్రపురం-బొబ్బిలి రహదారి నిర్మాణానికి టెండర్లు పిలిస్తే ఎవరూ కోట్ చేయలేదన్నారు. ప్రభుత్వం మళ్లీ టెండర్లు పిలిచే అవకాశముందని తెలిపారు.

తప్పని పాట్లు



రామభద్రపురం సెంటర్ వరకు స్తంభించిన ట్రాఫిక్

రామభద్రపురం: మంగళవారం కురిసిన భారీ వర్షాలకు పారాది కాజ్‌వేపై వరదనీరు ఉధృతంగా పారింది.దాంతో వాహనాలు కాజ్‌వేపై రాకపోకలు సాగించేందుకు వీల్లేకపోవడంతో బుధవారం ఉదయం 4 గంటలనుంచి పారాది వంతెన నుంచి రామభద్రపురం మండల కేంద్రం వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో వాహనదారులు,బొబ్బిలి, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు,పాఠశాలలు,కళాశాలల విద్యార్థులు నానా పాట్లు పడ్డారు.స్కూల్, కళాశాలల బస్సుల రాకపోకలకు అంతరాయం కలగడంతో విద్యార్థులు పాఠశాలలు,కళాశాలలకు వెళ్లకుండా ఇళ్లకు తిరిగి వెళ్లిపోయారు. పలువురు ప్రయాణికులు తమ ప్రయాణాలు వాయిదా వేసుకుని తిరిగి ఇంటి ముఖం పట్టాల్సి వచ్చింది. ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు బొబ్బిలి,రామభద్రపురం పోలీసులు నానా తంటాలు పడ్డారు. అలాగే వాహనాలను బాడంగి మీదుగా బొబ్బిలి వైపు వెళ్లేందుకు మళ్లించారు.



బస్సులు లేక కళాశాలలకు వెళ్లకుండా తిరిగి ఇంటికి వెళ్లిపోతున్న విద్యార్థినులు



బస్సులు ట్రాఫిక్‌లో చిక్కిపోవడంతో ఇబ్బందిపడుతున్న ప్రయాణికులు

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం



ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సునీల్‌కుమార్

రేగిడి: ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులను సైతం నయం చేయవచ్చని ఖండ్యాం గ్రామ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కేంద్రం వైద్యాధికారి సునీల్‌కుమార్ అన్నారు. ఖండ్యాం గ్రామంలో బుధవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం, అవగాహన సదస్సు నిర్వహించారు. శిబిరంలో 35 మందికి వైద్య తనిఖీలు చేసి అవసరమైనవారికి ఉచితంగా ఆయు ర్వేద మందులు అందజేశారు. వైద్యాధికారి సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఆయుర్వేద మందుల వల్ల సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని, ప్రతీ దానికి ఇంగ్లిష్ మందులు వాడడం వల్ల లివర్, కిడ్నీ, ఇతర అవయవాలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ఆయుర్వేద మందులతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. యోగా శిక్షకుడు రామకృష్ణ, ఏఎన్ఎం స్వాతి, ఆయుర్వేద వైద్య కేంద్రం సిబ్బంది శైలజ, తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లను వేగవంతం చేయాలి



పన్నుల వసూళ్లపై సిబ్బందిని ఆరా తీస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: మున్సిపాలిటీలో ఇంటి, కుళాయి, ఖాళీస్థలాలకు సంబంధించిన పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. బుధవా రం తన కార్యాలయంలో సచివాలయ రెవెన్యూ ,అడ్మిన్ విభాగాల సిబ్బందితో సమావేశం నిర్వ హించారు.ఈసందర్భంగా ఆమె మున్సిపాలిటీలోని వార్డుల వారీగా పన్నుల వసూళ్లు, పెండింగ్ వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ ఖాళీ స్థలాల యజ మానులు పన్ను చెల్లించకుంటే ఆ స్థలాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. పన్నుల వసూళ్లపై ఆర్‌ఐలు రోజూ రివ్యూ ,పర్యవేక్షణ చేసి సమాచారాన్ని తనకు అందించా లని చెప్పారు.

చిన్నశ్రీను సోల్జర్స్ సేవా కార్యక్రమాలు



ప్రత్యేక అవసరాల విద్యార్థులకు నిత్యావసర సరుకులు, పండ్లు అందజేస్తున్న సిరి సహస్ర

బొబ్బిలి: ఈనెల 5వ తేదీన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) పుట్టినరోజును పురస్కరించుకుని పట్టణంలో చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర ఆధ్వర్యంలో బుధవారం పలుసేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఆర్‌సీఎం స్కూల్‌లో చదువుకుంటున్న ప్రత్యేక అవసరాల విద్యార్థులకు నిత్యావసరాలు, పండ్లు అందజేశారు.అలాగే ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులు, గర్భిణు లకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.అనంతరం గొల్లపల్లిలో రక్తదాన శిబిరం నిర్వహించారు.రక్తదానం చేసిన యువకులను సిరిసహస్ర అభినందించారు. చిన్నశ్రీను సోల్జర్స్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కోటలో జాబ్ మేళా



ఉద్యోగాలకు ఎంపికై న వారికి నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి: స్థానిక కోటలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాను ఎమ్మెల్యే బేబీనాయన ప్రారంభించారు. సుమారు పది కంపెనీల ప్రతినిధులు తమ కంపెనీల్లో ఉద్యోగాల కోసం వివిధ అర్హతలను అనుసరించి ఇంటర్వ్యూలు నిర్వహించారని నిర్వాహకులు మజ్జి రామినాయుడు తెలిపారు.ఉద్యోగాలు పొందిన కొందరికి ఎమ్మె ల్యే చేతుల మీదుగా కంపెనీల ప్రతినిధులు నియామక పత్రాలను అందజేశారు. గ్రంథాలయ సంస్థ రాష్ట్ర డైరెక్టర్ రౌతు రామమూర్తినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కోమటిపల్లి ఎంజేపీ పాఠశాలకు అవార్డు



ఎంజేపీ సొసైటీ సెక్రటరీ నుంచి అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ పురుషోది

బొబ్బిలిరూరల్: మండలంలోని కోమటిపల్లి వద్ద ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలను ఎంజేపీ మహాత్మా జ్యోతిబా పూలే) సొసైటీ సూపర్ స్కూల్‌గా ఎంపిక చేసిందని ప్రిన్సిపాల్ పురుషోది తెలిపారు. మంగళవారం విజయవాడలో జరిగిన ఎంజేపీ పాఠశాలల ప్రిన్సిపాల్స్ వర్క్‌షాపులో ఎంజేపీ సొసైటీ కార్యదర్శి చేతులమీదుగా ప్రిన్సిపాల్ పురుషోది అవార్డు అందుకున్నారు.

పరామర్శ



రవీంద్రనాయుడి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎంపీ బెల్లాన, డాక్టర్ రాజేష్,తదితరులు

సంతకవిటి: కావలి గ్రామ సర్పంచ్ తమ్మినేని రవీంద్రనాయుడు ఇటీవల మృతి చెందారు. ఈవిషయం తెలుసుకున్న మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్, రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ బుధవారం కావలి వెళ్లి రవీంద్రనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. రవీంద్రనాయుడు కుమారుడు సత్యంనాయుడుకు ధైర్యం చెప్పి ఓదార్చారు. పరామర్శించిన వారిలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గురుగుబెల్లి స్వామినాయుడు, జి.గవరయ్య, జి.ఎన్.పురం సర్పంచ్ పప్పల ఈశ్వరరావు, రామారాయపురం మాజీ సర్పంచ్ యెన్ని శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కల్చరల్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ బి.నరేంద్ర, నాయకులు గురుగుబెల్లి దవరదరావు, రాజేశ్వరరావు, పైడి శ్రీహరి ఉన్నారు.

ఎరువుల పంపిణీలో ప్రభుత్వం విఫలం

- ఈనెల 6న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు,జెడ్పీటీసీ సరస్వతి

రామభద్రపురం: ఎరువుల పంపిణీలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, యూరియా కోసం ఇబ్బంది పడుతున్న రైతుల తరపున ఈనెల 6వ తేదీన బొబ్బిలి ఆర్డీఓ కార్యాలయం ఎదుట వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన తెలపనున్నామని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు,జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నిరసన కార్యక్రమానికి రైతులు,ప్రజలు,నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వానికి రైతుల గోడు పట్టడం లేదని విమర్శించారు. పంటలకు సకాలంలో ఎరువు వేయకపోతే దిగుబడులపై ప్రభావం పడుతుందని, ఇప్పటికైనా రైతుల అవసరానికి తగ్గట్టు ఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పాలసొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్,పార్టీ ఉపాధ్యక్షుడు డర్రు పైడిరాజు,పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ శ్యామలాకుమారి

రేగిడి: సీజనల్ వ్యాధుల బారినపడి వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీడీఓ శ్యామలాకుమారి వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అక్కడి సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించా రు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్‌వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని, వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు సేవలందించాలని చెప్పారు. గ్రామాల్లో ఎక్కడై నా తాగునీటి వనరుల వద్ద పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే శుభ్రం చేసేలా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు సూచించాలని అన్నారు.ప్రజలు వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. వైద్యాధికారి చలమయ్య, ఈఓ టి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

6న మండల సర్వసభ్య సమావేశం

బొబ్బిలిరూరల్: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.రవికుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి

బొబ్బిలిరూరల్: రానున్నమూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు చేసిన నేపథ్యంలో గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎం.శ్రీను ఆదేశించారు.బుధవారం తన కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. నదీపరీవాహక గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని,నదులు,వాగుల వైపువెళ్ల వద్దని సూచించాలని చెప్పారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని వేగవంతం చేయాలన్నారు. ఆర్‌ఐ రామకుమార్,సర్వేయర్ శర్మ,తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక నిమజ్జనం



రేగిడి: వన్నలిలో గణనాథుని ఊరేగింపు



బాడంగి: ముగడ కాలనీలో గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న ఉత్సవ కమిటీసభ్యులు

రేగిడి/బాడంగి: రేగిడి మండలంలోని సంకిలి, ఉంగరాడమెట్ట, అంబకండి, కందిశ, వన్నలి, లక్ష్మీపురం,తదితర గ్రామాల్లో, బాడంగి మండల కేంద్రం, ముగడ కాలనీలో వినాయక నిమజ్జన కార్యక్రమాలను ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. ఊరేగింపుల్లో యువత నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

సంక్షిప్తంగా...

స్వమిత్వ సర్వేను పక్కాగా చేపట్టాలి

బొబ్బిలిరూరల్: గ్రామాల్లో చేపడుతున్న స్వమిత్వ సర్వేలో లోటుపాట్లు ఉండరాదని, పక్కాగా సమాచారాన్ని సేకరించాలని తహసీల్దార్ ఎం.శ్రీను అన్నారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు,వీఆర్‌ఓలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమావేశమయ్యారు. స్వమిత్వ సర్వేలో భాగంగా ముందుగా గ్రామ సరిహద్దులు గుర్తించాలని, చెరువులు,పాఠశాలలు,పార్కులు,దేవాలయాల తదితర వివరాలను ఖచ్చితత్వంతో సేకరించాలని చెప్పారు. ప్రజల ఆస్తులు, స్థలాలు,ప్రభుత్వ స్థలాలు వంటివాటిని గుర్తించి, త్వరగా సర్వేను పూర్తిచేయాలని చెప్పారు. ఎంపీడీఓ పి.రవికుమార్,డిప్యూటీ ఎంపీడీఓ అల్లుభాస్కరరావు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో అన్నదానం



అన్నప్రసాదం వడ్డిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

రాజాం: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం అన్నదానం చేశారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి, స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

రేగిడి: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని ఐసీడీఎస్ బూరాడ సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్.నూకాలమ్మ చెప్పారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా మండలంలోని అంబకండి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, ఆరోగ్య జాగ్రత్తలపై బుధవారం అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐకమత్యంతో మెలగాలి



మాట్లాడుతున్న డీటీ శ్రీనివాసరావు

వంగర: గ్రామాల్లో ప్రజలు సోదరభావంతో ఐకమత్యంగా మెలగాలని డీటీ రుంకాన శ్రీనివాసరావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాల యంలో వివిధ కుల, మత సంఘాల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయ క విగ్రహాల నిమజ్జనాలు, దసరా ఉత్సవాలతో పాటు వివిధ మతాలకు సంబంధించిన పండగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాల ని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించరాదని అన్నారు. ఏఎస్ఐ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

రాజాం: ప్రభుత్వ పాఠశాలల్లో అన్నిరకాల రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఎంఈఓ యాగాటి దుర్గారావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని గెడ్డవలస గ్రామ ప్రాథమిక పాఠశాలలో బుధవారం తనిఖీలు చేశారు. రికార్డులను, విద్యార్థుల వర్క్ బుక్స్‌ను పరిశీలించారు. మౌలిక వసతుల సమస్యలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించి, నివేదికలు తయారు చేశారు. వీటిని ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు.

పాఠశాలల్లో తనిఖీలు



లక్ష్మీపేట పాఠశాలలో విద్యార్థితో పాఠ్యాంశాలు చదివిస్తున్న ఎంఈఓ వెంకటరావు

వంగర: మండలంలోని లక్ష్మీపేట, కొట్టిశ ప్రాథమిక పాఠశాలల్లో ఎంఈఓ వెంకటరావు బుధవారం తనిఖీలు చేశా రు.రికార్డుల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివించి వారి విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. వారి వెంట హెచ్‌ఎంలు ఇందిరాప్రియదర్శిని, ఓ.వి.భాస్కరరావు, ఉపాధ్యాయుడు బాలమోహన్ ఉన్నారు.